






కార్తీక పౌర్ణమి సందర్భంగా రాజమండ్రి పుష్కర ఘాట్ వద్ద ఉన్న భారీ శివలింగం మీదుగా కవిపించిన సూపర్ మూన్.. గోదావరి పుష్కర ఘాట్‌లో పౌర్ణమి స్నానాలు.. అంతర్వేది ఆలయంలో గోవింద నామాలతో ఓ మహిళ దీపాలంకరణ..



కనుల పండువగా..
కార్తీక దీపోత్సవం

- గోదావరి ఘాట్లలో వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలు
- కిక్కిరిసిన పంచారామాలు

అత్యంత పవిత్రంగా భావించే కార్తీక మాసంలో పౌర్ణమి విశిష్టత అందరికీ తెలిసిందే. శుక్ల పక్షంలో పున్నమి తిథి కలిగిన ఈ పదిహేనో రోజును హరి, హరులకు ప్రీతికరమైందని భక్తుల విశ్వాసం. ఈసారి కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భక్తులు వేకువజామునే స్నానాదులు చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గోదావరి, కాలువలు, పుష్కరిణీల్లో దీపాలు వదిలారు. నోములు నోచారు. రాత్రికి అనేక చోట్ల జ్వాలాతోరణం కార్యక్రమాలు నిర్వహించారు. పంచారామాలతోపాటు కోటిపల్లి, రాజమహేంద్రవరం గోదావరి, అన్నవరం, పిఠాపురం ఇలా అన్ని ముఖ్యమైన ప్రాంతాల వద్ద కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రాజగోపురంపై పున్నమి చంద్రుడు



ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయం రాజగోపురంపై బుధవారం రాత్రి పున్నమి చంద్రుడు ఇలా ప్రకాశించి ఆకట్టుకున్నాడు..



పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వెలుగుతున్న జ్వాలాతోరణం

జై సత్యదేవా..

అన్నవరంలో గిరిప్రదక్షిణ



- స్వామి నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- కనుల పండువగా గిరి ప్రదక్షిణ
- రెండు లక్షల మంది హాజరు
- ఘనంగా పంపా హారతులు, జ్వాలాతోరణం



పంపానదికి కార్తీక పౌర్ణమి హారతి



అన్నవరం వద్ద హైవేపై గిరి ప్రదక్షిణ వ్యూ.. పిల్లాడితో కలిసి ప్రదక్షిణ..



7

పర్యాటకం పరుగు





- ప్రకృతి ఒడిలో.. విహారం.. వినోదం..
- కేరళ తరహాలో ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ముందడుగు
- టెండర్లు పిలిచిన పర్యాటక శాఖ
- ఇప్పటికే కేరళ టూరిజం బృందాల పరిశీలన
- తూర్పు, కోనసీమల్లో హౌస్ బోట్లు.. కాకినాడ బీచ్ పర్యాటకం.. ఏజెన్సీలో ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరిలోని ప్రకృతి వనరులను ఒడిసి పట్టుకొని పర్యాటకపరంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వ చొరవతో పర్యాటక శాఖ పరుగు పెడుతోంది. ఇప్పటికే ఎక్కడికక్కడ పర్యాటకులకు ఏర్పాట్లు ఉన్నా.. వాటిని మరింత మెరుగ్గా ఆధునిక ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. మధురపూడి విమానాశ్రయంలోని రెండో టెర్మినల్ శరవేగంగా నిర్మాణం జరుగుతోంది. రైలు ప్రయాణికులకు గేట్‌వేగా రాజమహేంద్రవరం ఉంది. పర్యాటకుల సునాయాస ప్రయాణానికి మరింత కూడలిగా అవతరించనుంది. ఇక కోనసీమ అందాలు కేరళను తలపిస్తాయి. కాకినాడ బీచ్ విదేశాల్లో విహరించిన అనుభూతి కలిగిస్తుంది. మరోవైపు మారేడుమిల్లి ఏజెన్సీ అందాలను ఆస్వాదించడానికి ఇప్పటికే పర్యాటకులు క్యూకడుతారు. ఆధ్యాత్మిక టూరిజం సరేసరి. ఇప్పుడు వీటన్నిటినీ వినియోగించుకొని పర్యాటక సర్క్యూట్‌గా పుష్కరాల నాటికి అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం వేగంగా జరుగుతోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే గోదావరి పర్యాటకానికి మహర్దశ పట్టినట్టే.

● అలెప్పీ వెళ్లక్కర్లే..

హౌస్‌బోట్లకు కేరళలో అలెప్పీ(అళప్పుజ) ప్రసిద్ధి. ఇకపై అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఆ అనుభూతిని ఇక్కడే ఆస్వాదించొచ్చు. గోదావరి, వేమగిరి-ధవళేశ్వరం కాలువ, కొవ్వూరు పరీవాహక ప్రాంతాల్లో హౌస్‌బోట్ల ఏర్పాటుకు పర్యాటకశాఖ టెండర్లు పిలిచింది. కేరళకు చెందిన టూరిజం సంస్థల ప్రతినిధులు ఇప్పటికే ఇక్కడ ప్రదేశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే స్థానికంగా ఆపరేటర్లు ఉంటే వాళ్లకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కేరళ, బెంగళూరు వంటి ప్రాంతాల్లోని పెద్ద ఆపరేటర్లతో కలిసి పనిచేసినా స్థానికంగా మేలు జరుగుతుంది. హౌస్‌బోట్లు సింగిల్ రూమ్ లేదా డబుల్ రూమ్ విధానంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం పగటిపూట మాత్రమే నడుపుతారు. టూరిజం పాలసీ ప్రకారం రాయితీలు ఉంటాయి. ఇరిగేషన్ తదితర అనుమతులకు టూరిజం శాఖ సహాయ పడుతుంది. హౌస్‌బోట్లలో ఫుడ్ సదుపాయమూ ఉంటుంది. బోటుకు సుమారు రూ.30 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఆయా సంస్థలు, అవి అందించే సదుపాయాలకు అనుగుణంగా ధరలను నిర్ణయిస్తారు. ఒక్కో బోటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50మందికి ఉపాధి లభిస్తుంది.

● జల క్రీడలు..

కడియం, నిడదవోలు కాలువలు, గోదావరి లంకల్లో జల, సాహస క్రీడల టూరిజానికి ప్లాన్ చేశారు. జిప్‌లైనర్, ఎయిర్ బెలూన్స్, లాంగ్ జంప్‌లు, స్కూబా డ్రైవ్, రోప్ వే, స్పీడ్ బోట్లు వంటివన్నీ వస్తాయి. గోదావరి లోతు పుష్కర్ ఘాట్ నుంచి సరస్వతీ ఘాట్ వరకూ 30 అడుగుల లోతు ఉంటుంది. అందువల్ల హౌస్‌బోట్లు, అడ్వెంచర్ పర్యాటకానికి అనుకూలంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇసుకపై వెళ్లే వాహనాలు కేటీఎం వాహనాల వంటివి కూడా తీసుకొస్తారు. ఇసుక తిన్నెల్లో టెంట్లతో వసతి ఏర్పాటు చేస్తారు. హేవలాక్ బ్రిడ్జి(పాత రైలు వంతెన)ని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రైల్వేకు డబ్బు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. అయితే తర్వాత ప్రక్రియ ఆలస్యం కావడం, ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చా కేంద్ర ప్రభుత్వం రూ.46 కోట్లు మంజూరు చేసింది. హేవలాక్ బ్రిడ్జిపై బ్యూటిఫికేషన్, అటూ ఇటూ సావనీర్ షాప్స్, ఫుడ్ ఐటమ్స్ వంటివన్నీ వస్తాయి. ప్రతి స్తంభం దగ్గర రౌండ్ సర్కిల్‌ని కడతారు. అక్కడ కూర్చుని గోదావరి గాలిని ఆస్వాదించొచ్చు. ఈ వంతెనపై ఉండే నడకదారిపై నడిచి వెళ్లి బ్రిడ్జిలంకలో దిగి అక్కడి నుంచి బోటులో పుష్కర్‌ఘాట్ చేరుకొనేలా ప్లాన్ చేశారు. అయితే బ్రిడ్జికి సంబంధించి పుష్కర్‌ఘాట్ వద్ద ప్రవేశంలో 1044 చదరపు మీటర్ల స్థలం రైల్వే నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావాల్సి ఉంది. దీనిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించడంతో త్వరలోనే ఆ పని కూడా పూర్తి అయ్యే అవకాశం ఉంది.

కోనసీమ, కాకినాడల్లో...

కాకినాడలో ప్రత్యేకంగా బీచ్‌లను అభివృద్ధి చేసి బీచ్ టూరిజాన్ని మెరుగుపరుస్తారు. బీచ్ వాలీబాల్, స్నైలాంతర్లు వంటివి ఏర్పాటు చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలోని దిండి, పాశర్లపూడి బ్యాక్ వాటర్స్, అప్పనపల్లి దగ్గర, యానాం, గోగుల్లంక ఫెర్రీల్లో హౌస్‌బోట్లు, వసతి ఏర్పాటుచేస్తారు. ఏజెన్సీకి సంబంధించి రంపచోడవరం, మారేడుమిల్లిలో ట్రెక్కింగ్, జంగిల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తారు. ఇప్పటికే మారేడుమిల్లిలో ఆ తరహా వసతులు కొంతవరకు ఉన్నాయి.

● ప్రతిపాదనలకు ఆహ్వానం

పర్యాటక అభివృద్ధి కోసం టూరిజం శాఖ ప్రతిపాదనలకు ఆహ్వానం పలికింది. ఆసక్తి ఉన్న వారు టూరిజం వెబ్‌సైటులో బిడ్లను పరిశీలించవచ్చు. జలక్రీడలు, సాహస క్రీడలు, లగ్జరీ హౌస్ బోట్లు, పార్టీ బోట్లు ఏర్పాటు చేసి నిర్వహించాల్సి ఉంటుంది. సంస్థలు, వ్యక్తులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలు www.tourism.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. పర్యాటక అధికారులను 9505011951, 6309942025 నెంబర్లలో సంప్రదించవచ్చు.

● పుష్కరాల కంటే ముందే..



పర్యాటకపరంగా పుష్కరాల కంటే ముందుగానే ఓ రూపు తీసుకొచ్చి ఏర్పాట్లను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. స్థానికంగా కూడా ప్రాధాన్యం ఇస్తాం. పర్యాటకం అభివృద్ధి అయితే స్థానికులకు పెద్ద సంఖ్యలో ఉపాధి లభిస్తుంది. ఇక్కడి రుచులు, సంస్కృతి ప్రపంచానికి పరిచయం అవుతాయి. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఆ దిశగా అభివృద్ధికి కృషి చేస్తున్నాం.
- పి.వెంకటాచలం, జిల్లా పర్యాటక అధికారి, తూర్పుగోదావరి

హోమ్‌స్టేలతో పర్యాటకులకు కొత్త అనుభూతి : కోనసీమ కలెక్టర్



అయినవిల్లిలో రిసార్ట్స్‌ను పరిశీలిస్తున్న కోనసీమ కలెక్టర్

అమలాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హోమ్ స్టే విధానం వల్ల పర్యాటక రంగంలో స్థానిక ప్రజల జీవనశైలి, ఆచారాలు, సంప్రదాయాలు, వంటకాలు, సాంస్కృతిక వారసత్వాన్ని పర్యాటకులు ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అయినవిల్లి, అల్లవరం మండలంలో కలెక్టర్ బుధవారం పర్యటించారు. అల్లవరం మండలం గూడాల గ్రామంలో పొల్నేటి సాయి మండవ ఇళ్లు, ముక్తేశ్వరం విళ్ల దొరబాబుకు చెందిన అయినవిల్లి కోనసీమ విల్లా రిసార్ట్స్ పురాతన మండువ లోగిళ్లను ఆయన సందర్శించి హోమ్‌స్టేకు అనువైన వసతులు ఏమేరకు ఉన్నదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్‌స్టే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఆ దిశగా కోనసీమలో ఉన్న పురాతన, సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే మండువా లోగిళ్లను గుర్తించడం జరుగుతోందన్నారు. హోమ్‌స్టే ద్వారా స్థానిక ఆదాయ వృద్ధికి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ముఖ్యంగా పర్యాటకులు ఓ ప్రాంతంలోని అసలైన జీవన విధానాన్ని అనుభవిస్తారన్నారు. సాంస్కృతిక మార్పిడి, స్థానిక కళలు సంగీతం, నృత్యం, పండుగల విశిష్టతలను దగ్గరగా తెలుసుకోవచ్చన్నారు. సంప్రదాయాలపై పర్యాటకుల ఆసక్తి వల్ల స్థానికులు తమ సంస్కృతిని మరింత ఉత్సాహంగా కొనసాగించడానికి కారణమవుతుందన్నారు. అలాగే సాధారణ హోటల్ బసకు భిన్నంగా హోమ్‌స్టేలు నిజమైన స్థానిక అనుభూతిని అందిస్తాయనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదన్నారు. సుస్థిర పర్యాటకంతోపాటు ప్రకృతితో సఖ్యత కలిగిన పర్యావరణానికి హాని లేని రీతిలో పర్యాటకులు పూర్వపు సంప్రదాయ సాంస్కృతిక వారసత్వపు అనుభూతిని అందించడంలో ఒక సమర్థమైన సాధనమన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో కె.మాధవి, జిల్లా పర్యాటక అధికారి అన్వర్ ఉన్నారు.

పంచాయతీరాజ్‌శాఖలో పదోన్నతులు

- రెండేళ్ల సర్వీస్‌ను ఏడాదికి తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో నూతనంగా 60 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు

7

కంచిపల్లి శ్రీనివాస్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నిందితులను నేడు అరెస్టు చేసే అవకాశం
- మంత్రి లోకేశ్‌ను కలిసిన మృతుడి భార్య దే

7

గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఏపీని నిలుపుతాం

6

- లండన్ డబ్ల్యూటీఎం-2025లో పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

జగన్.. జగన్నాటకాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు

- మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ)నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగన్ ఆడే జగన్నాటకాలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని మంత్రి సుభాష్‌అన్నారు. రామచంద్రపురం టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తుపాన్‌వల్ల అన్నదాతలు కష్టంలో ఉంటే రైతుల పరామర్శ పేరుతో జగన్ జేజేలు కొట్టించుకుంటున్నారని, బలప్రదర్శన చేస్తున్నారని విమర్శించారు. ఒకప్పుడు జగన్ జే బ్రాండ్‌కు తోడు జోగి రమేష్ జేఆర్ బ్రాండ్ తోడయిందని ఎద్దేవాచేశారు. నకిలీమద్యం తయారుచేసి ప్రభుత్వ షాపుల్లో అమ్మారని పక్కా ఆధారాలతోనే సిట్ జోగిరమేష్‌ను అరెస్టు చేసిందన్నారు. అవినీతి చేసి బీసీ కులం కార్డు వాడుకో వడం చేతగాని తనమన్నారు. అవినీతిలో మీకు మీరే సాటి అన్నారు. నకిలీ మద్యం తయారీ కేసులో ఏ1 నిందితుడు వాంగ్మూలంలో పూర్తి వివరాలు వెల్లడించారని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ గురించి మాట్లాడే నైతిక స్థాయి జగన్‌కు లేదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

బాలిక కుటుంబీకులకు మంత్రి ఓదార్పు

రామచంద్రపురం పట్టణంలో ఆత్మహత్యకు పాల్పడిన 5వ తరగతి బాలిక కుటుంబీకులను మంత్రి సుభాష్, ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం బుధవారం ఓదార్చారు. ఏరియా ఆస్పత్రిలో బాలిక రంజిత మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.

మా కుమార్తె మృతిపై అనుమానాలున్నాయి

7

- పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలి : రంజిత తల్లిదండ్రులు

జిల్లాలో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్
- ఏడిదలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులనుంచి 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. మండపేట మండలం ఏడిద రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జేసీ నిషాంతి, రాష్ట్ర సివిల్ సప్లయి చైర్మన్ తోట సుధీర్‌లతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. రైతులవద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి నగదును రైతుఖాతాలో 48గంటల వ్యవధిలో జమచేస్తామన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన సభ జరిగింది. జేసీ నిషాంతి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 232 రైతుసేవాకేంద్రాల్లో ఏర్పాట్లు చేశామన్నారు రైతులనుంచి గిట్టుబాటు ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. జిల్లాలో 1.62లక్షల ఎకరాల్లో ఖరీఫ్‌వరిపంట సాగుచేశారని, ధాన్యం 4.06లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అన్నారు. ధర బాగుంటే బయట కూడా అమ్ముకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతు బ్యాంకు ఖాతాలో నగదు జమచేస్తామన్నారు. వైసీపీ హయాంలో ధాన్యం విక్రయించినప్పుడు ఆరునెలలకు కూడా ధాన్యం నగదు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ మాట్లాడుతూ రైతు వద్ద ఉన్న చివరి ధాన్యం గింజను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలుపై ఫిర్యాదుకు కలెక్టర్ కార్యాలయంతోపాటు జిల్లా సివిల్ సప్లయి కేంద్రాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. జిల్లాలో 154 మిల్లుల ద్వారా ధాన్యం సేకరించి మిల్లింగ్ చేస్తామన్నారు. జిల్లాలో బ్యాంకు గ్యారెంటీగా రూ.400కోట్ల మేర మిల్లర్లు ప్రభుత్వానికి గ్యారెంటీగా ఇచ్చారని సివిల్ సప్లయి అధికారి ప్రసాద్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కోసం 80లక్షలు గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. ధాన్యం తరలించే రవాణా వాహనాలు 1300 ట్రక్కులను సిద్ధం చేశామని, వాటికి జీపీఎస్‌తో జత చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయి అధికారి ఆడపా ఉదయభాస్కర్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీనివాస్, రామచంద్రపురం ఆర్డీవో అఖిల, జిల్లావ్యవసాయశాఖ జేడీ బోస్‌బాబు, ఆలమూరు వ్యవసాయశాఖ ఏడీ చౌదరి, మండపేట తహసీల్దార్ టి.రాజేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, మున్సిపల్ చైర్మన్ పతివాడ నూకదుర్గారాణి, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, సాగునీటి సంఘ అధ్యక్షులు కోలు ప్రోలు బాబు, మేకా జేజిబాబు, మేకా నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్, వ్యవసాయశాఖాధికారి కె.ప్రభాకర్, నల్లమిల్లి వీరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చుండ్రు వీవీఎస్ చౌదరి(మండపేట), దేశంశెట్టి లక్ష్మీనారాయణ (అమలాపురం), ఆలమూరు తాలుకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ(చంటి) పాల్గొన్నారు.



ఏడిదలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్, జేసీ నిషాంతి, ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేటను రాజమహేంద్రవరంలో కలపాలంటూ కలెక్టర్‌కు వినతి

మండపేటనియోజకవర్గాన్ని రాజమహేంద్రవరంలో కలపాలంటూ జేఏసీ కన్వీనర్ కామన ప్రభాకరరావు నేతృత్వంలో అఖిలపక్ష నేతలు కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కోనసీమ కలెక్టరేట్ ఇక్కడికి దూరంగా ఉందని, అనుకూలంగా ఉండే రాజమహేంద్రవరంలో కలపాలని కోరారు. జేఏసీ నేతలు కృష్ణవేణి, దూలిజయరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

కార్తీక దీపోత్సవం







- ఆలయాల్లో భక్తి ప్రపత్తులతో కార్తీక పౌర్ణమి పూజలు
- దీపాలు వెలిగించి.. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు
- వ్రతాలు, అభిషేకాలు, దర్శనాలతో కిక్కిరిసిన పుణ్యక్షేత్రాలు

రాజమహేంద్రవరం గోదావరిలో చిన్నారికి నదీస్నానం చేయిస్తున్న తల్లి.. అరటిదొప్పల్లో కార్తీక దీపారాధన చేసిన యువతులు

రాజమహేంద్రవరంలో అరటిదొప్పపై దీపం వెలిగించిన యువతి



రాజమహేంద్రవరం గోదావరిలో తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో..

ద్రాక్షారామ,నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామభీమేశ్వరాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు విశేషసంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామునుంచి భక్తులు రాక ప్రారంభమైంది. క్యూలైన్ల ద్వారా భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.నవవధువులు స్వామివారికి పువ్వు, పిందె సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక అభిషేకాలు జరిపారు. అశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉసిరిక చెట్టువద్ద నోములు ఆచరించిన మహిళలు రాత్రికి ఆలయంలో దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో అల్లు వెంకటదుర్గాభవానీ పర్యవేక్షణలో సిబ్బంది సేవలందించారు. అన్నప్రసాద భవనంలోను, పైండావారి సత్రంలోను అన్నదానం నిర్వహించారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అన్నవరంలో 10వేల జంటల వ్రతాలు

అన్నవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నవరంలో సత్యదేవుడి సన్నిధిలో బుధవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా రద్దీ నెలకొంది. మంగళవారం రాత్రికే రత్నగిరికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి వ్రతాలు ప్రారంభించారు. మహిళలు రావిచెట్టు వద్ద కార్తీకదీపాలను వెలిగించి తమభక్తిని చాటుకున్నారు. పౌర్ణమి పర్వదినాన 10వేల జంటలు వ్రతాలు ఆచరించారు. వివిధ విభాగాల ద్వారా రూకోటి మేర ఆదాయం లభించింది. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు సైతం తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రూ.1500 వ్రత మండపం సరిపడక ప్రత్యామ్నాయంగా ప్రధానాలయ గోపురం బయట టెంట్ వేసి వ్రతాలను నిర్వహించాలని నిర్ణయించారు. భక్తులు ధ్వజస్తంభం దగ్గర వ్రతాలు ఆచరించుకోవాలని వస్తే టెంట్‌వేసి ఏర్పాటు చేయడంపై అభ్యంతరం తెలపడంతో అధికారులు వాటిని నిలుపుదల చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటలు సమయం భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. రద్దీ అధికంగా ఉన్నంతసేపు అంత్రాలయ దర్శనం స్థానంలో శీఘ్రదర్శనానికి పరిమితం చేశారు. ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కంపార్టుమెంట్‌లు ద్వారా మాత్రమే భక్తులను అనుమతించడంతో కొద్దిసమయం ఆలస్యమైనా అవాంఛనీయ సంఘటనలు, తోపులాటలు జరగకుండా కార్తీక పౌర్ణమి రద్దీ ముగిసింది.

సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో..

సామర్లకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం బుధవారం తెల్లవారుజామునుంచీ భక్తుల శివనామస్మరణలతో మార్మోగింది. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో తెల్లవారుజామున గోపూజలు చేశారు. భీమేశ్వరస్వామిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. కార్తీక నోములు కావడంతో భక్తులు ఉపవాసాలతో పూజలు చేశారు. మారేడు, జమ్మి, రావిచెట్లువద్ద మహిళలు దీపాలను వెలిగించారు. నూతన వధువులు కంద పిలకలు, పసుపు పిలకలతో కూడిన స్వయంపాకాలను స్వామికి సమర్పించారు. అధికసంఖ్యలో జ్వాలాతోరణంలో భక్తులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో స్వామికి పువ్వు, పిందె సమర్పిస్తున్న నవవధువు



సామర్లకోటలో భీమేశ్వరుడికి కందపిలకల వాయినం సమర్పణకు వచ్చిన నూతన జంట



అన్నవరం కొండపై కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



అన్నవరం పంపా తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



సామర్లకోట భీమేశ్వరాలయంలో విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు



సామర్లకోట భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



విద్యుత్‌కాంతుల వెలుగులో గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం



రాజమహేంద్రవరం గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న యువతులు



అన్నవరంలో రద్దీ కారణంగా క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

సంగమ క్షేత్రం.. భక్తజన సంద్రం



అంతర్వేది శివాలయం వద్ద జ్వాలా తోరణం

- ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు
- అంతర్వేదికి పోటెత్తిన భక్తులు
- సాగర తీరంలో పుణ్యస్నానాలు.. నీలకంఠుడికి అభిషేకాలు

అంతర్వేది, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సాగర సంగమ తీరం అంతర్వేది పుణ్యక్షేత్రంలో బ్రహ్మ ప్రతిష్ఠించిన పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా వేకువజాము నుంచి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరుడు వద్ద దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. రామేశ్వరం కృత్య రామలింగేశ్వరస్వామి, మోరి, సఖినేటిపల్లి అంతర్వేది కొత్తపంతెనవద్ద ఉన్న శివాలయాల్లో భక్తులు కార్తీక పౌర్ణమి పూజలు చేశారు. అంతర్వేది శివాలయం వద్ద రాత్రి శివలింగం, ఓంకార ఆకారాలతో దీపాలను వెలిగించారు. అనంతరం వైభవంగా జ్వాలా తోరణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు.

పుణ్యస్నానాలు.. దీపోత్సవం

అంతర్వేది పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం వేకువజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామికి పంచామృతాలతో అభి షేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాయంత్రం వేంకటేశుడి గోవింద నామాలతో దీపాలంకరణ నిర్వహించారు. ఆలయ ఆవరణమంతా కార్తీక దీపాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంవద్ద భక్తిశ్రద్ధలతో జ్వాలాతోరణం నిర్వ హించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఆశీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. పుణ్యక్షేత్రంలో అధికసంఖ్యలో భక్తులు దీపాలు వెలిగించారు.



అంతర్వేది శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పల్లకిలో ఊరేగుతున్న శ్రీపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి

వాడపల్లిలో జ్వాలా తోరణం

ఆత్రేయపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామిఆలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శివునికి పంచామృతాభిషేకం, దీపాలంకరణ నిర్వహించారు. అనంతరం రాత్రి ఆలయం వద్ద జ్వాలాతోరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. వివిధ గ్రామాల్లోని శివాలయాల వద్ద జ్వాలా తోరణం కార్యక్రమం భక్తజన శివనామస్మరణ నడుమ ఘనంగా నిర్వహించారు. కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. గోదావరి నదీలో పుణ్యస్నానాలు ఆచ రించి దీపాలంకరణ చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.



వాడపల్లిలో జ్వాలా తోరణం

గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఏపీని నిలుపుతాం

డబ్ల్యూటీఎం-2025లో మంత్రి కందుల దుర్గేష్



లండన్‌లో డబ్ల్యూటీఎం-2025లో పాల్గొన్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్‌ని సగర్వంగా నిలుపుతామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.లండన్‌లో జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్(డబ్ల్యూటీఎం)-2025లో పాల్గొని ఏపీలో పర్యాటక అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహం తదితర అంశాలను వినిపించామన్నారు. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను డిప్యూటీ హైకమిషనర్, వివిధ రాష్ట్రాల పర్యాటక మంత్రులతో కలిసి ఆయన ప్రారంభించారు. 20కిపైగా అంతర్జాతీయ టూర్ ఆపరేటర్లు, హోటళ్ల ప్రతినిధులు, మైస్ ఇన్వెస్టర్లు, ట్రావెల్ మ్యాగజైన్స్, మీడియా బ్లాగర్స్‌తో చర్చించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగంలో పెట్టుబడుల అవకాశాలపై వివరణ ఇచ్చామన్నారు. ఏపీ స్టాల్ ద్వారా మన రాష్ట్రంలోని ప్రకృతి సహజసిద్ధ ప్రదేశాలు, చారిత్రాత్మక కోటలు, తీర ప్రాంతాలు, వారసత్వ సంపదపై ప్రచారం కల్పించామన్నారు.జీఐ ట్యాగ్ పొందిన ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను ప్రదర్శించి వాటి ప్రత్యేకతలను, తయారీ విధానాన్ని వివరించామన్నారు. అనంతరం అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ నూతన పర్యాటక పాలసీని తెలియజేసి పెట్టుబడులను ఆహ్వానించామన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు వర్షిణి ఎంపిక



అమలాపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తూటారపు వీవీ వర్షిణి జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం లంక రాణి తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈనెల 6,7,8 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లిలో జరిగే రాష్ట్ర సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. వర్షిణిని హెచ్‌ఎం రాణి, ఉపాధ్యాయులు, పీఈటీ బుజ్జి, సర్పంచ్ చొల్లంగి శివాలిని తదితరులు అభినందించారు.

శనేశ్వరస్వామికి వెండి ఝుటాజుటం బహూకరణ



వెండి ఝుటాజుటం బహూకరిస్తున్న దాత దంపతులు

కొత్తపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ప్రసిద్ధి చెందిన మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామికి బుధవారం కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన చిన్నే శ్రీనివాస్-లక్ష్మి దంపతులు కార్తీక పౌర్ణమి సందర్భంగా 3.18 కిలోల వెండి ఝుటాజుటాన్ని స్వామివారికి సమర్పించారు. ఈ మేరకు ఆలయ సహాయ కమిషనరు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబుకు ధర్మకర్తల మండలి సభ్యులు గ్రామపెద్దల సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా దాతలకు ఆలయార్చకులు వేదాశీర్వచనం అందించారు.కార్యక్రమంలో చింతం విజయకృష్ణమోహన్, ధరణాల రామకృష్ణ, ఎంపీటీసీ ఎస్‌వీవీ సత్యనారాయణ, పాలక మండలి సభ్యులు జీఎస్‌వీ నాగాజీ,జీవీవీ సత్యనారాయణ, గ్రంధి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.250 కోట్లతో 69 సబ్‌స్టేషన్లు

నాణ్యమైన విద్యుత్ పంపిణీయే లక్ష్యం

విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి

అనకాపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని,అందులో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల్లో రూ.250 కోట్లతో 69 సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. బుధవారం ఆయన అనకాపల్లిలో రూ.5.5 కోట్లతో నిర్మించనున్న ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లాలోని కె.కోటపాడు మండలం చౌడువాడ, కింతలి గ్రామాల్లో నిర్మించిన సబ్‌స్టేషన్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా చౌడువాడలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని ప్రాంతాల్లో కొత్తగా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం విధించిన ఎఫ్‌పీపీసీఏ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ ప్రైస్ అడ్జస్ట్‌మెంట్) చార్జీ (యూనిట్‌కు) 40 పైసల నుంచి 27 పైసలకు తగ్గించనున్నట్టు పేర్కొన్నారు.ప్రతిఒక్కరూ సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకొని ప్రయోజనం పొందాలన్నారు. అనకాపల్లి జిల్లాలో ఇప్పటివరకూ 20 వేల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఇళ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్,ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, కె.రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు అక్షయ ఎంపిక



సర్పవరం జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ పి.వెంకటాపురం అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల 9వ తరగతి విద్యార్థి శీలి అక్షయ జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పరిమళ తెలిపారు. ఈ నెల 1నుంచి 3వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 వాలీబాల్ సెలక్షన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. త్వరలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. జాతీయ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శనతో అంబేడ్కర్ ఆశ్రమ పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించేలా తర్ఫీదునిస్తున్న పీడీ శారదను అభినందించారు.

వారాహిమాత ఆలయ ఆదాయం రూ.10 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

కాకినాడ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులోని శ్రీవారాహి అమ్మవారి ఆలయ హుండీలను బుధవారం లెక్కించినట్టు ఆలయ సింగిల్ ట్రస్టీ ఆర్.సౌజన్య తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ కాకినాడ తనిఖీ అధికారి వడ్డి పణీంద్రకుమార్ హుండీలను తెరవగా ఈవోలు బీవీవీ చౌదరి, ధనలక్ష్మి, మురళీ వీరభద్రరావు, సత్తిబాబు, తిరుమల రవితేజ పాల్గొనగా మొత్తం 40 రోజులకు గానూ రూ.10,18,071 ఆదాయం వచ్చిందన్నారు. సీసీ కెమెరాల నిఘాలో గ్రామ పెద్దలు, పోలీసుల సమక్షంలో హుండీల ఆదాయం లెక్కింపు జరిగినట్టు ఈవో తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపంలోని హైవే బ్రిడ్జిల కింద రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సుమారు 50ఏళ్ల వయసు కలిగి నలుపు రంగు ప్యాంటు, నీలం రంగు సెక్యూరిటీగార్డులు వేసుకొనే యూనిఫాం షర్టు ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు 99597 63463 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అన్నవరం.. భక్తజనసంద్రం



జ్వాలాతోరణం వెలిగించిన దృశ్యం

- వేడుకగా సత్యదేవుడి గిరిప్రదక్షిణ
- సత్యదేవ నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- ఉదయం పల్లకీసేవలో, మధ్యాహ్నం సత్యరథం వెంబడి

గిరియాత్రలో పాల్గొన్న 2 లక్షలమంది భక్తులు



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

అన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడు కొలువైన రత్నసత్యగిరిలు బుధవారం జై సత్యదేవ నామస్మరణతో మార్మోగాయి. స్వామి వెలసి భక్తులతో పూజలందుకునే 2 కొండల చుట్టూ ప్రదక్షిణ చేశారు. కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం నిర్వహించిన స్వామివారి గిరిప్రదక్షిణకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 2 లక్షల మంది విచ్చేయడంతో అన్నవరం భక్తజనసం ద్రమైంది. గతేడాది మాదిరిగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఉదయం 8.30 గంటలకు పల్లకీలో, సత్యరథం భక్తులతో మధ్యాహ్నం 2గంటలకు గిరియాత్ర ప్రారంభించారు. ఉదయం 7.30కి కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకీలో మెట్లమార్గం గుండా కొండదిగువన తొలిపావంచా వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, గిరిప్రదక్షిణ ప్రత్యేకాధికారి ఆర్‌జేసీ వేండ్ర త్రినాధరావు టెంకాయి కొట్టి స్వామివారి పల్లకీసేవ ద్వారా గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్వామి,అమ్మవార్లను పల్లకీలో పండితుల మంత్రోచ్ఛరణలు భక్తుల గోవిందనామస్మరణలతో ఈ గిరియాత్ర తొలిపావంచా వద్ద నుంచి జాతీయ రహదారి మీదుగా బెండపూడి సమీపంలో పుష్కరకాలువ రోడ్డుగుండా సుమారు 8.5 కిలోమీటర్లమేర సాగింది.



భక్తులకు మంచినీళ్లు, పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, గిరిప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ



పంపా తీరం వద్ద ముగిసే..

పంపా తీరం వద్ద గిరిప్రదక్షిణ యాత్ర ముగిసింది. చివరగా ప్రత్యేక మండపంలో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించి చతుర్వేదపండితుల వేద స్వస్తి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు. కొందరు భక్తులు యాత్ర అనంతరం పంపా రిజర్వాయర్‌లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి రత్నగిరి కొండకు చేరుకోగా మరికొందరు తిరిగి స్వగృహాలకు చేరుకున్నారు. గిరియాత్ర విజయవంతంతో సిబ్బందిని ఈవో, చైర్మన్లు అభినందించారు. ఇదిలా ఉండగా గిరిప్రదక్షిణ దారిలో రోలింగ్ సరిగా చేయకపోవడం,ఎండుగడ్డి అక్కడక్కడా మాత్రమే పరచడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యలో కొన్నిచోట్ల గ్రీన్‌కార్పెట్ పరచడం ఉపశమనం కలిగించింది.

ప్రభుత్వ అప్రమత్తతతో ప్రత్యేక ఏర్పాట్లు

ఇటీవల కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఇటు రెవెన్యూ, పోలీస్, దేవదాయశాఖ అధికారులను అప్రమత్తం చేసింది. సుమారు 700మంది పోలీసులు, ఆరుగురు తహశీల్దార్లు, 20మంది వీఆ ర్వోలను ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు పల్లకీ, సత్యరథం వెంబడి నడుస్తూ ఎక్కడా తోపులాటలకు ఆస్కారం ఇవ్వకుండా రోప్‌పార్టీ ద్వారా కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు.

శోభాయమానంగా పంపా హారతులు

కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి పంపాహారతులు కార్యక్రమం అత్యంత శోభాయమానంగా జరిగింది. రాత్రి 6.30కి స్వామి, అమ్మవార్లను కొండపై నుంచి మేళతాలాలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ తెప్పోత్సవానికి వినియోగించిన పంటు వద్దకు తోడ్కొనివచ్చి పంటుపై ఆశీనులుగావించి గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం నదీమతల్లికి పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అనంతరం అర్చకస్వాములు పంపానదికి ఏడురకాలైన హారతులిచ్చారు. ముందుగా ఏక హారతి, నేత్రహారతి, బిల్వ హారతి, సర్పహారతి, కుంభహారతి, నక్షత్ర హారతుల నంతరం చివరగా కర్పూర హారతులిచ్చారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనంతో కార్యక్రమం ముగిసింది. ఈవో, చైర్మన్, ప్రత్యేకాధికారి పాల్గొనగా వైదిక కార్యక్రమాలను ప్రదానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి రుత్విక్‌లు చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి తదితరులు నిర్వహించారు.

కొండలు, గుట్టలు దాటుకుని...

సత్యరథం ద్వారా ప్రదక్షిణకు దేవస్థానం విస్తృత ప్రచారం చేపట్టడంతో అధికసంఖ్యలో భక్తులు సత్యరత్నగిరికొండల వెంట నడిచారు. కొండలు, గుట్టలు దాటుకుని గోవిందనామస్మరణల నడుమ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. దేవస్థానం, దాతల సహకారంతో పండ్లు, మజ్జిగ, బిస్కట్ ప్యాకెట్ల స్టాల్స్ ఏర్పాటుచేశారు. దేవస్థానం తరుపున సుమారు 2 లక్షల మంచినీటి ప్యాకెట్లను పీఆర్వో విభాగం అందుబాటులో ఉంచారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇబ్బందులు జరగకుండా ఈవో, చైర్మన్, ప్రత్యేకాధికారి ఎప్పటికప్పుడు వాకీటాకీల ద్వారా సమాచారం తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. మార్గ మధ్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి వైద్యసేవలందించారు. గిరియాత్రకు తరలివచ్చిన భక్తులతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వైభవంగా జ్వాలాతోరణం

కార్తీకపౌర్ణమి సందర్భంగా కొండదిగువన తొలిపావంచా వద్ద జ్వాలాతోరణం కార్యక్రమం వైభవంగా జరిగింది. పంపా హారతులు ముగిసిన తరువాత స్వామి,అమ్మవార్లను పంపాతీరం నుంచి తొలిపావంచా వద్దకు రాత్రి 8గంటలకు తోడ్కొనివచ్చారు. తొలిపావంచాకు ఇరువైపులా ఎండిగడ్డితో తోరణాన్ని ఏర్పాటు చేశారు. స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అనంతరం అర్చకస్వాములు వేదమంత్రాల నడుమ తోరణానికి నిప్పంటించారు. వాటి మధ్యలో పల్లకీలో స్వామి,అమ్మవార్లను ముమ్మారు ప్రదక్షిణ చేయించారు. తోరణం నుంచి జ్వాల అనంతరం వెలువడిన భస్మం కోసం భక్తులు పోటీపడ్డారు. ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను జాతీయరహదారి మీదుగా మళ్లించారు.



గిరిప్రదక్షిణలో పాల్గొన్న ఈవో సుబ్బారావు కుటుంబం





అలసిపోయిన భక్తుల అవస్థలు



సత్యదేవుడి సేవలో పాల్గొన్న మహిళలు

మా కుమార్తె మృతిపై అనుమానాలున్నాయి

పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలి : రంజిత తల్లిదండ్రులు

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 9వ తరగతి విద్యార్థిని రంజిత మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. బుధవారం పట్టణంలో ఏరియా ఆసుపత్రిలో బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంఘటనపై రంజిత తల్లిదండ్రులు సునీత,రాజు మాట్లాడుతూ మా కూతురి మృతిపై తమకు అనుమానాలు ఉన్నట్లు తెలిపారు. ఆసుపత్రి వద్ద విలేకర్లతో వారు మాట్లాడారు. తమ కుమార్తె ఉరి వేసుకున్న తీరును చూస్తే అనుమానం కలుగుతుందన్నారు. తమ ఇంటి యజమాని కుమారుడిపై అనుమానం వ్యక్తం చేశారు. తాము ఈ ఇంటిలో 3ఏళ్లుగా ఉంటున్నామన్నారు. ఉరి వేసుకున్న చున్నీముడులు విప్పడం సాధ్యం కాలేదని, బాలిక అన్ని ముడులు వేయడం సాధ్యం కాదని తెలిపారు. ఉరివేసుకోవడానికి తమ కుమార్తె ఫ్యాను అందే ఎత్తులో లేదని అక్కడ ఎత్తుకు ఏవిధమైన స్టూల్‌గాని మరొకటిగాని ఉపయోగించిన దాఖలాలులేవని పేర్కొన్నారు. మా కుమార్తెను హత్య చేసి ఉరి వేసి ఉండవచ్చనే అనుమానం ఉందన్నారు. ముఖ్యంగా గతంలో నేరచరిత్ర కలిగిన ఇంటి యజమాని కుమారుడిపై అనుమానం ఉందని, పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

చెడు వ్యసనాలకు బానిసై ఇళ్లల్లో చోరీలు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న తిమ్మాపురం ఎస్ఐ

యువకుడి అరెస్ట్

బంగారం, వెండి, నగదు స్వాధీనం

సర్పవరం జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలనే ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న యువకుడిని తిమ్మాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. 10.6 గ్రాముల బంగారు వస్తువులు, 1026.4 కిలోల వెండి వస్తువులతో పాటు రూ.18,196 నగదును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లో కెళితే కాకినాడ సూర్యారావుపేటకు చెందిన లంక నాగవీర వెంకట దుర్గాశివ గణేష్ (20) ప్రస్తుతం లచ్చి రాజువారి వీధి టూటౌన్ పోలీస్‌స్టేషన్ వెనుకాల నివసిస్తున్నాడు. అతడు గతంలో దుస్తుల దుకాణంలో పని చేసి 2 నెలల క్రితం మానేసి ఇంటిలో ఉంటున్నాడు. చెడు వ్యసనాలు, ఫోన్‌లో బెట్టింగ్‌లకు బానిసై డబ్బుల కోసం తిమ్మాపురం, టూటౌన్ పోలీసుస్టేషన్ల పరిధిలో బయట తాళం వేసి ఉన్న ఇళ్ల వద్ద పగటిపూట రెక్కీ నిర్వహించి వరుస చోరీలకు పాల్పడు తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 4.50 గంటలకు గణేష్ తిమ్మాపురం వై.జంక్షన్ వద్ద ఉండగా అరెస్ట్ చేసినట్టు తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్ పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు

రెండేళ్ల సర్వీస్‌ను ఏడాదికి తగ్గిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ

ఉమ్మడి జిల్లాలో నూతనంగా 60 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న సిబ్బందికి భారీస్థాయిలో పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు 2 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వారికి ప్రమోషన్ అర్హత ఉండగా ఇప్పుడు ఆ కాలాన్ని ఏడాదికి తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1కి పదోన్నతి పొందనున్నారు. అలాగే 150 మందికి పైగా 1 పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి పొందనున్నారు. ఇకపై గ్రామ సచివాలయాల పర్యవేక్షణ కోసం మండలస్థాయిలో డిప్యూటీ ఎంపీడీవో పోస్టులను నూతనంగా నియమించనున్నారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలో ఉన్న 60 మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలు బాధ్యతలు చేపటి ఆయా మండలాల్లో సచివాలయాలను పర్యవేక్షించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనను ఆమోదించడంతో మార్గం సుగమమైంది.

నగదు, మోటార్ సైకిళ్ల చోరీ కేసులో నలుగురి అరెస్టు

- నిందితుల్లో ముగ్గురు మైనర్లు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాల్సిన సమయంలో వారు చెడుమార్గం పట్టారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఇందులో ముగ్గురు మైనర్లు ఉండటం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గల చల్లా చినబాబు షాపింగ్ కాంప్లెక్సులో లక్ష్మీవెంకటేశ్వర ఏజెన్సీస్, ఐస్‌పార్లర్‌లో రూ. 45 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. షాపు నిర్వాహకుడి ఫిర్యాదుతో గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. కాగా, సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారంగా దర్యాప్తు సాగించారు. దీంతో చోరీకి పాల్పడిన పిఠాపురం పట్టణానికి చెందిన గుబ్బల దయానంద్‌పాల్ (22), 17 సంవత్సరాల బాలుడు ఒకరు, 16 సంవత్సరాల బాలురు ఇద్దరితో కలిపి నలుగురిని అరెస్టు చేశారు. అంతేకాకుండా విచారణలో వీరు మరిన్ని చోరీలకు పాల్పడినట్టు వెల్లడైంది. ఇందులో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం, పిఠాపురం మండలం మాధవపురంలో రెండు మోటార్ సైకిళ్లను చోరీ చేసినట్టు గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. కాగా నిందితుల్లో ఒకరు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. మిగిలిన ఇద్దరు మైనర్లు మధ్యలో చదువు మానివేసినట్టు తెలిసింది. రానున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉరేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

పోలీస్ కేసు నమోదు

రాజానగరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధి రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న ఒక విద్యార్థి మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ బుధవారం ఇక్కడ విలేకరులకు వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చందుర్తికి చెందిన యార్ల ప్రసాద్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయన కుమారుడు యార్ల సత్యదేవకుమార్ (16) తొర్రేడులోని ఓ విద్యాసంస్థలో గల వసతి గృహంలో ఉంటూ ఇంటర్ చదువుకుంటున్నాడు. కాగా, తాను వసతి గృహంలో ఉండలేకపోతున్నానని, ఇంటి వద్ద నుంచే కళాశాలకు వెళ్తానని అప్పుడప్పుడూ మారాం చేసేవాడు. ఈ క్రమంలో గత నెల 28న సత్యదేవకుమార్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కళాశాల నుంచి యాజమాన్యం అనుమతితో తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చారు. ఆరోగ్యం కుదుట పడిన తర్వాత హాస్టల్‌కు తిరిగి తీసుకెళ్లే క్రమంలో ఇంటి వద్ద నుంచే వెళ్తానని చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు ఈ ఏడాది ఓపిక పట్టు, వచ్చే ఏడాది నుంచి నీకు నచ్చినట్టు కళాశాలకు వెళ్దువుగాని అని నచ్చజెప్పి పంపించేవారు. ఈ క్రమంలో ఈనెల 4న ఉదయం 10.30 గంటలకు తండ్రి ప్రసాద్ సత్యదేవ కుమార్‌ను తీసుకుని కళాశాలకు చేరుకున్నారు. తన కుమారుడు డే స్కాలర్‌గా చదువుతా నంటున్నాడని ప్రిన్సిపాల్‌తో మాట్లాడి ఒప్పించి వదిలి వచ్చినట్టు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో తన కుమారుడు ఉరేసుకున్నాడని, కొనఊపిరితో ఉండడంతో సాయి ఆసుపత్రిలో చేర్పించామని అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు కళాశాల యాజమాన్యం ఫోన్‌లో సమాచారం అందించింది. దీంతో వెంటనే ఆసుపత్రికి వచ్చి చూడగా తన కుమారుడు చనిపోయినట్టు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారని ఆయన తెలిపారు. ఈమేరకు తన కుమారుడు ఇంటిమీద బెంగతో హాస్టల్‌లో ఉండలేకే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని భావిస్తున్నానని, తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ తండ్రి ప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద మృతికేసులో అదుపులోకి..

- నిందితుడ్ని కోర్టులో ప్రవేశపెట్టిన యానాం పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న యానాం ఎస్పీ వరదరాజన్, సిబ్బంది

యానాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యానాం బల్లవారివీధిలో ఓ ఇంట్లో అద్దెకుంటున్న వివాహిత అనుమానాస్పద మృతి కేసులో నిందితుడైన భర్త పెమ్మడి నానిను యానాం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యానాం ఎస్పీ వరదరాజన్ వివరాలను వెల్లడించారు. ఐ.పోలవరం మండలం గుత్తెనదీవికి చెందిన పెమ్మడి దీనా(26), భర్త నానీ గత నాలుగు నెలలుగా అద్దెకు ఉంటు న్నారు. కాగా, వీరి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మద్యానికి బానిసైన నాని తరచూ భార్యను అనుమానంతో కొడుతుండేవాడు. దీంతో దీనా కొంత కాలంగా వేరుగా ఉండటంతో పాటు భర్త నాని నుంచి విడాకులు కోరుతూ కోర్టును ఆశ్ర యించారు. ఈ క్రమంలో నాని మళ్లీ గొడవ పడ్డాడు. కాగా, దీనా ముఖంపై బలంగా కొట్టడంతో పాటు పీక పిసికి హత్య చేసిన అనంతరం ఆమె ఫోన్ తీసుకుని నాని పారిపోయాడు. మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం బంధువులకు అప్పగించారు. యానాం పోలీసులు, క్రైంసిబ్బంది నిందితుడు నానిని అదుపులోకి తీసుకుని హత్యకు గల కారణలను సేకరించారు. అనంతరం నిందితుడ్ని కోర్టులో ప్రవేశపరిచి రిమాండ్ కోసం యానాం సబ్ జైలుకు తరలించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆడలరసన్, ఎస్ఐలు పునీత్‌రాజా, కట్టా సుబ్బరాజు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

కొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనరేటర్ నుంచి వచ్చిన కరెంట్‌షాక్‌తో ఒకరు మృతిచెందాడు. ఈ సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో బుధవారం చోటుచేసుకొంది. దళితపేటకు చెందిన ఎం. నూకరాజు (31) గ్రామ శివార్లో రొయ్యల చెరువుల వద్ద కూలీ పనులు చేస్తుంటాడు. చెరువులకు వచ్చే కరెంటు స్తంభంపై హెచ్‌జీ ఫీజు పోవడంతో బుధవారం కరెంట్ సరఫరా ఆకస్మాత్తుగా నిలిచి పోవడంతో చెరువుల నిర్వాహకుడు నూకరాజును స్తంభం ఎక్కి హెచ్‌జీ ఫీజు వేయాలని చెప్పడంతో ఎక్కి ఫీజు వేస్తుండగా అప్పటికే ఆన్‌లో ఉన్న జనరేటర్ కరెంటు స్తంభానికి రిటర్న్ వచ్చి షాక్ కొట్టడంతో నూకరాజు స్తంభంపైనే మృతిచెందాడు. సమాచారం తెలుసుకొన్న కొత్తపల్లి ఎస్ఐ జీ. వెంకటేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీతంపేటలో అగ్నిప్రమాదం

- రెండిళ్లు దగ్ధం ..

రూ. 5 లక్షల ఆస్తినష్టం



కాలిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూసిబ్బంది

వీఆర్‌పురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటలో బుధవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు ఇళ్ళు పూర్తిగా కాలిపోయాయి. ఉదయం పుట్టలో పాలు పోసేందుకు ఇరు కుటుంబాల వారు వెళ్లిన సమయంలో అగ్నిప్రమాదం జరగడంతో సామగ్రి, నగదు, బంగారం కాలిపోవడంతో బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. రూ. ఐదు లక్షల ఆస్తినష్టం ఏర్పడిందని అంచనా. రెవెన్యూ ఆర్ఐ అక్కడకు చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబాలకు తహశీల్దార్ సరస్వతి ఆదేశాలతో 25 కిలోల బియ్యం అందజేశారు. దాతలు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

నల్లజర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిన్ను ప్రేమిస్తున్నాను.. వివాహం కూడా చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ వివాహితను నమ్మించి మోసం చేసిన యువకుడిపై నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదయ్యింది. వివరాలివి.. తెలికిచర్లకి చెందిన మరీదు రామాంజనేయులు తన భర్తతో విభేదాల కారణంగా గత మూడు సంవత్సరాలుగా పుట్టింటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన యువకుడు పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో శారీరకంగా కలిశారు. ప్రస్తుతం ఆమె గర్భం దాల్చడంతో మొఖం చాటేశాడు. దీంతో పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

కంచిపల్లి శ్రీనివాస్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నేడు నిందితులను అరెస్టు చేసే అవకాశం
- లోకేష్‌ను కలిసిన మృతుడి భార్య దేవి



అమలాపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండంలోని కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) హత్య కేసును అమలాపురం పట్టణ పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకుని ఎట్టకేలకు ఛేదించారు. నిందితుల వివరాలను గురువారం ప్రకటించే అవకాశం ఉంది. కాగా మంగళవారం రాత్రి శ్రీనివాస్ భార్య దేవి తన పిల్లలను తీసుకుని ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్‌ను కలిసి తన భర్త శ్రీనివాస్ హత్యకు దారితీసిన పరిస్థితులను వివరిస్తూ తన గోడు వెళ్లబుచ్చుకుంది. వైసీపీకి చెందిన రౌడీషీటర్లు తన భర్తను అతి కిరాతకంగా హత్య చేశారని ఆమె తన బిడ్డల సాక్షిగా వివరించింది. తన కుటుంబానికి తీరనిఅన్యాయం చేసిన వైసీపీ నాయకుల ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరింది. అలాగే రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. హత్యకు దారితీసిన పరిస్థితులను ఇప్పటికే పోలీసులు గుర్తించారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, వాహనాల్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు పాల్పడిన కీలక నిందితులు గంగుమళ్ల షణ్ముఖేశ్వరరావు అలియాస్ కానుబాబు, అడబాల శంకర్, సలాది రాంబాబు అలియాస్ అప్పన్న, భాస్కర్ల ప్రసాద్, రావులపాలెంకు చెందిన అనిల్‌ను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికీ ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. హత్య రోజు ఏమి జరిగింది? ఇందులో ఎవరెవరు పాల్గొన్నారు?నాలుక కోసేశారా?తదితర అంశాలపై పోలీసులు ఇప్పటికే దర్యాప్తు పూర్తి చేసినట్టు సమాచారం. హత్య జరిగిన నాటి నుంచి ప్రధాన నిందితుడు కానుబాబు పరారీలో ఉండటంతో అమలాపురంలోని ఆయన వ్యాపార లావాదేవీలన్నీ పూర్తిగా స్తంభించాయి. హత్యకు ఉపయోగించిన ఆయుధాల కోసం పోలీసులు ప్రధాన పంటకాల్వల్లో బుధవారం వేట చేపట్టినట్టు తెలిసింది. ఇంతకూ శ్రీనివాస్ చేత ఫోన్ చేయించింది ఎవరు అనేది పోలీసులే చెప్పాలి.

4 కిలోల వెండి, 10 గ్రాముల బంగారం చోరీ

కడియం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిలంకలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి ఇంట్లో దొంగతనం జరిగి 4 కిలోల వెండి, 10 గ్రాముల బంగారం పోయినట్టు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పొట్టిలంకకు చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ అలియాస్ చెముడులంక డాక్టర్ వేపూరి సూర్యసత్యనారాయణ, అతని భార్య ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. ఈయనకు ఉన్న ఇద్దరు అబ్బాయిల్లో ఒకరు అమెరికాలో, మరొకరు సింగపూర్‌లో ఉంటుండగా, అమ్మాయి హైదరాబాదులో ఉంటున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి ఆర్‌ఎంపీ డాక్టర్ సూర్యసత్యనారాయణ ఇంటి ప్రధాన ద్వారం తెరిచిబీరువా తాళాలు పగుల గొట్టి బంగారం, వెండి దొంగిలించుకుపోయారు. పొట్టిలంకలోనే ఉంటున్న డాక్టర్ పెద్దకోడలు స్వాతి ఉదయం సమయంలో ఇంటిని శుభ్రం చేయడానికి తలుపులు తెరవగా తలుపులు, బీరువా బద్దలు కొట్టి ఉన్నట్టు గమనించారు. దీంతో బీరువాలో వస్తువులు పోయినట్టు గమనించి అత్తమామలకు తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ఏ. వెంకటేశ్వరరావు, ఎస్సై దుర్గాప్రసాద్, క్రైమ్ సిబ్బందితో పాటు క్లూస్‌టీమ్‌ను రప్పించి సంఘటనా స్థలంలో పలు ఆధారాలు సేకరిస్తున్నారు. ఆర్ ఎంపీ డాక్టర్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమిశ్రగూడెంలో 16.5 కాసుల బంగారం చోరీ

- వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీమ్

నిడదవోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లోని బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో నివాసముంటున్న కాసగాని సత్యనారాయణ భార్యకు ఈనెల 1వ తేదీన పాము కాటు వేయడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటిలో లైట్లు వెలుగుతుండడంతో కాసగాని సత్యనారాయణ అన్న కుమారుడు దుర్గాప్రసాద్ ఫోన్ చేసి ఇంటిలో లైట్లు వెలుగుతున్నాయి వచ్చేశారా అని పలకరించడంతో హుటాహుటిన వచ్చిన సత్యనారాయణ ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా సుమారు 16.5 కాసుల బంగారు ఆభరణాలు దొంగలు పట్టుకొని పోయినట్టు గుర్తించి సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సమిశ్రగూడెం ఎస్సై జె.కల్పన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఇంటి నుంచి వేలిముద్రలు సేకరించారు.

అభివృద్ధి పనులకు రూ.10కోట్లు

యానాం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో సీఆర్ఐఎఫ్ పథకం ద్వారా యానాం నియోజకవర్గానికి రూ.10కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. జాతీయ రహదారి ఆనుకుని కనకాలపేట పంపుహౌస్ నుంచి ఫ్రెంచ్‌జెండాస్తంభం వరకు అభివృద్ధి పనులకు అనుమతులు వచ్చాయన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

- శివాలయాల్లో అభిషేకాలు, పూజలు
- ఆలయాల ఆవరణలో జ్వాలాతోరణం





ఐ.పోలవరం: మురమళ్లలో జ్వాలాతోరణం, ముమ్మిడివరం:ఉమామూరేశ్వరస్వామివారి ఆలయంలో పూజలు, ఉప్పలగుప్తం:గొల్లవిల్లి శ్రీమాణిక్యాంబ సమేతభీమేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం

అంబాజీపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో కార్తీకపౌర్ణమి పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం రాత్రి స్వామివారిని పల్లకీలో తీసుకువచ్చి జ్వాలాతోరణం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. కార్తీక పౌర్ణమిరోజు 365వత్తులు వెలిగించడం పుణ్యమని పలువురు వేదపండితులు పేర్కొన్నారు. మండలంలోని ఏకాదశ రుద్రుల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరంలోని శ్రీపార్వతీ రాజేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీరామునిచే శివలింగ ప్రతిష్ఠతో పురాణ ప్రసిద్ధి చెందిన ఎస్.రామేశ్వరం పార్వతీ రామేశ్వర శివాలయంలో బుధవారం అభిషేకాలు నిర్వహించారు.ఆలయానికి భక్తులు పోటెత్తారు. చైర్మన్ అంగాని రామారావు ఆధ్వర్యంలో పులేటికుర్తి ఫణిశర్మ అభిషేకాలు జరిపించారు. మాదే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. బోడసకుర్రు, కొమ్మరగిరిపట్నం, బెండమూర్లంక, గోడి, గోడిలంక, అల్లవ రం, దేవగుప్తం, యెంట్రుకోన తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకాలు, జ్యోతిలింగార్చనలు జరిగాయి. శివాలయాల వద్ద జ్వాలాతోరణ పూజలు నిర్వహించారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ముమ్మిడివరం పరిసర ప్రాంతాల్లో ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు స్నానాలు ఆచరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాసంతో ఉన్న భక్తులు సాయంత్రం ఆలయాలకు చేరుకుని అరటి పళ్లు, పువ్వు, పిడ్డెను స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకుని దీపాలు వెలిగించారు. ముమ్మిడివరం నగర పరిధిలోగల శ్రీఉమామూరేశ్వరస్వామి, కొమానపల్లిలో ఉన్న పార్వతి సమేత చోడేశ్వర లోకేశ్వరస్వామి, అయినాపురంలో ఉన్న ఉమాసోమేశ్వరస్వామి, అన్నంపల్లిలో పార్వతీ గౌరేశ్వరస్వామి, క్రాపచింతలపూడిలోని ఉమావల్లభేశ్వరస్వామి, రాజేల్లంకలో ఉమాసోమేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీకపౌర్ణమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాత్రి ఆలయాలు వద్ద జ్వాలాతోరణం నిర్వహించారు. ఆలయాలు వద్ద పౌర్ణమి నేపథ్యంలో భక్తులతో కిటకిటలాడాయి.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని పలు శివాలయాలు వద్ద బుధవారం రాత్రి జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెండి గడ్డి దెన్నులను వెలిగించి క్రింద నుంచి ఉత్సవ మూర్తులను పల్లకీలో మూడు సార్లు ఊరేగించారు. అనంతరం మండిన వెండి గడ్డిని తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. పి.గన్నవరం గరుడేశ్వరస్వామి, మొండెపులంక శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయాలు, మండలంలోని పలు శివాలయాల్లో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద రాత్రి జ్వాలాతోరణం నిర్వహించారు. అధికసంఖ్యలో మహిళలు పాల్గొని కొబ్బరి బొండాలు, గుమ్మడికాయలు, కందా, పునుపు గొడుగులు స్వామి వారికి అందించారు. ముఖ్యంగా కొత్తగా వివాహమైన యువతులు స్వామి వారి దర్శనానికి పోటెత్తారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం కుండలేశ్వర క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే భక్తులు వృద్ధ గౌతమిలో స్నానాలాచరించి పార్వతీ కుండలేశ్వరస్వామిని, క్షేత్రపాలకుడు శ్రీరుక్మిణీ సమేత వేణుగోపాలస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరుడు, కనకదుర్గను పూజించారు. పీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాజు ఆర్థిక సహాయంతో కాట్రేనికోన నుంచి కుండలేశ్వరం వరకు భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం చండీ హోమం నిర్వహించారు. అర్చకుడు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో భద్రకాళీ అమ్మవారికి చండీహోమం జరిగింది. ట్రస్టు బోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల వ్యాప్తంగా శివాలయాల వద్ద జ్వాలాతోరణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. గొల్లవిల్లి శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జ్వాలాతోరణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో యువత కార్యక్రమంలో పాల్గొని వేడుకలు నిర్వహించారు. బాణసంచా కాల్చి సంబరం జరుపుకున్నారు. జ్వాలాతోరణం స్వీకరణకు రైతులు, యువకులు పోటీ పడ్డారు. మునిపల్లి, విలసవిల్లి, ఉపప్పలగుప్తం, భీమనపల్లి, కూనవరం, చల్లపల్లి, ఎస్.యానాం,ఎన్.కొత్తపల్లి శివాలయాల వద్ద జ్వాలాతోరణఉత్సవాలు నిర్వహించారు.




అంబాజీపేట: జి.అగ్రహారంలో జ్వాలాతోరణం, కాట్రేనికోనలో ప్రత్యేక అలంకరణలో కుండలేశ్వరస్వామి

జిల్లా పోటీలకు విద్యార్థుల ఎంపిక

మలికిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టేలంక హైస్కూలులో మంగళవారం అమలాపురం డివిజన్ స్థాయి కబడ్డీ, ఖోఖో అండర్-14, అండర్-17 పోటీల్లో బాలబాలికల ఎంపిక జరిగింది. ఎంపికలో విజేతలు జిల్లా ఎంపికలకు పాల్గొంటారని ఎంఈవో ఎం.విజయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు వైవీ సత్యనారాయణ, అమలాపురం డివిజన్ కోఆర్డినేటర్ కె.గణేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు సీహెచ్‌జీవీఎస్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు ఎన్వీ సుబ్బారావు, విద్యాకమిటీ చైర్మన్ దుర్గాప్రసాద్, మండల కోఆర్డినేటర్ వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న జట్లు

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

యానాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి అనూహ్య స్పందన వచ్చింది. యానాం ఓల్డ్‌ఏజ్‌హోమ్‌లో బుధవారం హైదరాబాద్ బసవతారకం ఇండో, అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ డి.రవిశంకర్, వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ పెనల గంగయ్య, మల్లాడి అభిమాన సంఘ నాయకులు పెండెం సూర్యప్రకాష్, గిడ్ల చంద్రరావు, మల్లాడి శామ్యూల్ ప్రారంభించారు. 235మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఉచిత వైద్యసేవలు అందించిన బసవతారకం ఇండో, అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వైద్యులు, సిబ్బందిని యానాం వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ గంగయ్య, మల్లాడి శామ్యూల్ శాలువాలతో సత్కరించారు. నాయకులు గూటం శివగణేష్, బడుగు బలరాం, కాదా వెంకటేశ్వరావు, పెనుగొండ దుర్గబాబు, సహదేవరాజు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులను ప్రోత్సహిద్దాం

రాజోలు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో దేశంలో తయారైన వస్తువులను మాత్రమే ఉపయోగించాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్ మాలే శ్రీనివాస్‌నాగేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వయం సంవృద్ధి భారత్ నినాదంతో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం రాజోలులో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా స్వగృహం వద్ద కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటా స్వదేశీ నినాదంతో వికసిత్ భారత్ లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్, గంటి చంద్రశేఖర్, వద్దమూడి ప్రకాష్, దేవళ్ల మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీసీఎల్‌ఆర్‌ను పర్మినెంట్ చేయాలి

యానాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): యానాం ప్రజాపనుల శాఖలో 20ఏళ్ల నుంచి ఎఫ్‌టీసీఎల్‌ఆర్‌లుగా పనిచేస్తోన్న 126మందిని పర్మినెంట్ చేయ్యాలని సిబ్బంది ఆందోళనకు దిగారు. బుధవారం సాయంత్రం ప్రజాపనుల శాఖ కార్యాలయం వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట బైఠాయించి ప్లకార్డులతో ఆందోళన చేశారు. మాకు ఉద్యోగభద్రత కల్పించాలని, రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

యానాంలో ఆందోళన చేస్తున్న సిబ్బంది →



కాంగ్రెస్ అభియోగాలపై సీబీఐ విచారణ కోరిన మల్లాడి

- గవర్నర్‌కు మల్లాడి లేఖ



యానాం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ తనపై మోపిన అభియోగాలపై స్వచ్ఛత నిరూపణకు స్వచ్ఛందంగా సీబీఐ విచారణ కోరుతున్నట్టు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మల్లాడి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఒక లేఖను పంపారు. పుదుచ్చేరిలోని పలు నియోజకవర్గాల్లో నాపట్ల ప్రజలకు ఉన్న ఆదరణ చూసి కొందరు రాజకీయ నాయకులు నాపై సోషల్‌మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించడం కోసం రాబోయే ఎన్నికల్లో నా వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ట దెబ్బతీసి లబ్ధి, సానుభూతి పొందాలనే తప్పుడు నిందలు నాపై మోపుతున్నారన్నారు. ఎమ్మెల్యేగా, కార్పొరేషన్ చైర్మన్‌గా, మంత్రిగా అనేక రకాల పదవులు పారదర్శకత, అంకిత భావంతో చేపట్టానన్నారు. ఎలాంటి మచ్చా తెచ్చే ఏ పనీ చేయలేదన్నారు. నిజాయితిని నిరూపించుకోవడం కోసం నన్ను ప్రత్యేక ప్రతినిధి హోదా నుంచి తొలగించాలని కోరారు. నాపై తక్షణమే సమగ్రమైన ప్రాథమిక విచారణ మీఅధికార హోదాలో ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. యానాం కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు నేను నిర్వహించిన అన్ని పదవులు, ఏ అంశాపైనైనా ఈరోజు వరకు సీబీఐ విచారణకు నేను సిద్ధమన్నారు.

బెల్లంపూడి పాఠశాల నిర్మాణం పూర్తి చేస్తాం



బెల్లంపూడిలో పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బెల్లంపూడిలో పాఠశాల భవనం సమస్య దీర్ఘకాలికంగా ఉందని, ప్రస్తుతం ప్రభుత్వం అందించే నిధులు సరిపడకపోతే స్వంత నిధులతో భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు పాఠశాల భవనాన్ని పూర్తి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. బెల్లంపూడిలో రూ.30లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న నూతన పాఠశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం భూమిపూజ చేసి అనంతరం మాట్లాడారు. పిల్లలకు అవసరమైన అన్ని సౌకర్యాలతో పాఠశాలను అందుబాటులోకి తెస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కె.హెలనా, గ్రామ సర్పంచ్ బండి మహాలక్ష్మి, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్యకావు, సొసైటీ చైర్మన్ సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, యర్రాప్రగడ రవీంద్రగోపాల్, చీకరమిల్లి శ్రీనివాసరావు, ఆదిమూలం వెంకన్న, అనిశెట్టి శేషారావు, గూటం రవికుమార్ పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఐద్వా సభ్యులు, విద్యార్థినులు

ముమ్మిడివరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం మండలంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన రాయపురెడ్డిబాబిని కఠినంగా శిక్షించాలని ఐద్వా మహిళా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం ముమ్మిడివరంలో నిరసన చేపట్టారు. అనంతరం బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలపై బాలికలు ఎలా రక్షణ పొందాలనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జి.దైవకృప, కమిటీ సభ్యురాలు గుత్తుల హైమావతి మాట్లాడుతూ దేశంలో బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఐద్వా సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సత్కరిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో అమలాపురం మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి కోటుం కుమార్‌చందు శ్రీదర్ కాంస్య పతకం సాధించాడు. అలాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన అండర్-14 బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీల్లో మేడిచర్ల రిత్విక విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని పాఠశాల హెచ్ఎం కాశీ ఘన సత్యనారాయణ తెలిపారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.వీరాస్వామి, వార్డు కౌన్సిలర్ పిండి అమరావతి, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, వి.రేఖ, కేవీ సత్యనారాయణ, చంద్రమోహన్ వసంత తదితరులు అభినందించారు.

పాదలాడలో పారిశుధ్య పనులు

రాజోలు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అంటు వ్యాధులు ప్రబలకుండా పొదలాడలో మంగళవారం సర్పంచ్ కడలి సత్యనారాయణ పారిశుధ్య సిబ్బందితో బ్లీచింగ్ చల్లించారు. పారిశుధ్య పనుల్లో భాగంగా రోడ్డుప్రక్కన చెత్తా చెదారాలను శుభ్రం చేయించారు. పాఠశాలలు, పలు వీధుల్లో ఆయన దగ్గరుండి పారిశుధ్య పనులు పర్యవేక్షించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం


ఐ.పోలవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు అయ్యగారి రామమూర్తి దంపతులు రూ10,116 విరాళాన్ని ఆలయ సిబ్బందికి బుధవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ దాతలను అభినందించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



అంతర్వేది, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి గీతామందిరానికి ఆనుకుని ఉన్న ర్యాంపులో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక రవాణా రాత్రింబవళ్లు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రోజుకు 70ట్రాక్టర్ల ఇసుకను సఖినేటిపల్లిరేవులో తరలిస్తూ వేలాది రూపాయలు వసూళ్లు చేసి ఈఇసుక దందా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టీబీ లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలి



టీబీ వ్యాధిపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పి.గన్నవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎవరికైనా టీబీ లక్షణాలు కనిపిస్తే దగ్గరలో టీబీ సెంటర్‌లో ఉచితంగా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి సూచించారు. ఆర్.ఏనుగుపల్లి పంచాయతీ వద్ద బుధవారం స్థానికులకు టీబీపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టీబీ నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వం ఉచితంగా చేస్తుందని, వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స కాలంలో రోగి వ్యక్తిగత ఖాతాలోకి ప్రతి నెల రూ.1000 జమ చేస్తుందన్నారు. టీబీ గురించి భయపడాల్సిన పనిలేదని, వ్యాధి పూర్తిస్థాయిలో నయమవుతుందన్నారు. స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో ప్రోటీన్ల ఆహారాన్ని అందిస్తామన్నారు. అనంతరం టీబీ రహిత సమాజాన్ని స్థాపిద్దామంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, ఎంపీహెచ్‌వో రాజశేఖర్, ఎస్‌టీఎల్ఎస్ సర్వారాయుడు, ఎస్‌టీఎస్ చక్రధర్, పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రవికుమార్ ఆమరణ దీక్ష భగ్నం



రవికుమార్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):ముమ్మిడివరం ఆర్టీసీ బస్సులు రాకపోకలు పునరుద్ధరించాలని, ఆక్రమణలను తొలగించాలని డిమాండ్‌తో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీపురుమల్లి రవికుమార్ దీక్షను బుధవారం పోలీసులు భగ్నం చేసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం ఆయనకు ప్రభుత్వ వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని చెప్పడంతో ఎస్ఐ జ్వాలా సాగర్ ఆధ్వర్యంలో రవికుమార్ దీక్షను భగ్నం చేసి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా అతని మద్దతుదారులు అడ్డుపడ్డారు. అయినా ఆయన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ముమ్మిడివరం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వైద్య సాయం అందిస్తున్నారు. అయితే రవికుమార్ మాత్రం దీక్షను కొనసాగిస్తున్నారు. పలువురు నాయకులు రవికుమార్‌ను పరామర్శించి సంఘీభావం తెలిపారు.

తాచుపాము హల్‌చల్



ముమ్మిడివరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒక ఇంటి ఆవరణలో త్రాచుపాము హల్‌చల్ చేయడంతో వారంతా భయభ్రాంతులకు గురయ్యారు. ముమ్మిడివరం మండలం చినకొత్తలంకలో పొత్తూరి వీరవెంకటకృష్ణంరాజు ఇంటి ఆవరణలోని కోళ్ల గూటిలోకి తాచుపాము ప్రవేశించి కోళ్లను తిని హల్‌చల్ చేసింది. దీంతో వీరవెంకటకృష్ణంరాజు కుటుంబం భయభ్రాంతులకు గురయ్యారు. భీమనపల్లికి చెందిన స్నేక్‌కేచర్ గణేష్‌వర్మ అక్కడి చేరుకుని పాము బంధించారు. జనసంచారం లేని సుదూర ప్రాంతంలో తాచును వదిలారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

మామిడికుదురు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త హితోభిలంగా కృషి చేయాలని అల్లా చైర్మన్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు కోరారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో ప్రతి ఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ప్రచురించిన 27అంశాలతో కూడిన ప్రతిని చదివి వినిపించారు. పార్టీ మండల కమిటీలను నియమించి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జిల్లా ఉపాధ్యక్షుడు అడపా శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు బైరుశెట్టి దుర్గా రామకృష్ణ, మెండా ఆదినారాయణ, నక్కా త్రిలోచనరావు, కంకిపాటి సుబ్బారావు, గాడి సత్తిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ముమ్మిడివరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధితులకు కూటమి నాయకులు నిత్యావసరాలు పంపిణీ చేశారు. అయినాపురంలో బాధితులకు 25కిలోల బియ్యం, నిత్యావసరాల కిట్లను, మత్స్యకార కుటుంబాలకు 50కిలో బియ్యం, నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. తహశీల్దార్ టి.సుభాష్ రేషన్‌డిపోలను పరిశీలించి సరుకులను త్వరగా పంపిణీ చేయాలని కోరారు. చిక్కాల అంజిబాబు, బొంతు నాగరాజు, యనమదల సుబ్బారావు, మట్టా సత్తిబాబు, సబ్బిది డేవిడ్‌రాజు, ఇందుకూరి పాండురంగరాజు, గుబ్బల నాగరాజు, మట్టపర్తి సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్ర బేస్‌బాల్ పోటీలకు గొల్లవిల్లి విద్యార్థులు



విద్యార్థులతో హెచ్‌ఎం కనకదుర్గ

ఉప్పలగుప్తం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ అండర్-19 బేస్‌బాల్ విభాగంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొనేందుకు గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు దొంగ హరిబాబు, మదుర మధుప్రియ ఎంపికైనట్టు హెచ్‌ఎం గోకరకొండ కనకదుర్గ తెలిపారు. కడప జిల్లాలో ఈనెల7 నుంచి 9వరకు జరిగే పోటీల్లో వారు పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, పీఎంసీ చైర్మన్ వోలా సత్యనారాయణ, పీడీలు గొలకోటి ఫణీంద్ర, డి.సరస్వతి, టి.సునీత, వి.విజయభాస్కర్ అభినందించారు.

స్వదేశీ వస్తువులు వినియోగించాలి

మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా

పి.గన్నవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆశయ సాధనకు ప్రతి భారతీయుడు స్వదేశీ వస్తువులను మాత్రమే వినియోగించాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా పిలుపునిచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు అధ్యక్షతన బుధవారం పి.గన్నవరంలో జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పిలుపుమేరకు ప్రతి మండలానికి శాశ్వత మండల ఇన్‌చార్జీలను నియమిస్తున్నామన్నారు. గ్రామాల వారీగా పార్టీ కమిటీలు వేసి కూటమి విజయంలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ చీకరమిల్లి శ్రీనివాసరావు, కుడిపూడి సూర్యనారాయణ, గంట పెద్దిరాజు, చీకరమిల్లి సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఏఎస్ఐ పసుపులేటి వెంకటేశ్వరరావు, దిగుమర్తి ఏడుకొండలు, పితాని వెంకటేశ్వరరావు, తోలేటి సుబ్బారావు, వినయ్‌చందు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో అవకతవకలపై విచారణ ఎప్పుడో?

ఉప్పలగుప్తం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం పంచాయతీలో అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయని ఎంపీటీసీ తాళ్ళ లక్ష్మీనరసాయమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై డీపీవో విచారణ కోసం ఒక కమిటీని నియమిస్తూ అక్టోబరు 24న ఉత్తర్వులిచ్చారు. ఏడు రోజుల్లోగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు. ఇప్పటి వరకు విచారణ జరగకపోవడంపై గ్రామస్తులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు విచారణ చేపట్టకపోవడంపై ఉన్నతాధికారులను కలిసి నివేదిస్తామని ఎంపీటీసీ ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న భరత్ తదితరులు

అమలాపురం టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను మాజీ ఎమ్మెల్యే వర్మ ప్రారంభించారు. ఈపోటీల్లో అమలాపురం వడ్డిగూడెం శ్రీవాగ్దేశి పాఠశాల నుంచి డీఎస్ హర్షిత, ఎ.హర్షమణికంఠ, పి.వెంకట్‌లు అద్భుత ప్రతిభ చాటి తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీరామచంద్రమూర్తి, హెచ్‌ఎం పిచ్చిక సుబ్రహ్మణ్యం, మార్షల్ ఆర్ట్స్ ప్రతినిధి దేశంశెట్టి సాయిబాబు తదితరులు అభినందించారు.

భారీ వర్షంతో రహదారులు జలమయం

పి.గన్నవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రహదారులతో పాటు పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. మధ్యాహ్నం 11.30గంటల నుంచి రెండు గంటలు పాటు ఆగకుండా భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారితో పాటు డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేని పలు కాలనీలు, వీధులు, కొబ్బరితోటలు వర్షం నీటితో నిండిపోయాయి. భారీ వర్షం కురవడంతో వర్షం నీరు నిలిచిపోయి వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు. తుఫాన్ కారణంగా ఒరిగిన వంట చేలల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు బయటకు పంపించే ఏర్పాట్లు చేసుకున్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

అల్లవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అల్లవరంలో జరిగిన మండల స్థాయి చెకుముకి పోటీల్లో కొమరగిరిపట్నం హర్ష విజ్ఞానభారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పి.మణి హర్షిత్, కడలి సూర్యకాంతి, కడలి సూర్యహరికేష్‌లకు మండల విద్యాశాఖాధికారి కె.కిరణబాబు బహుమతులు అందించారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, విద్యాసాగర్, ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.

బీవీసీ ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

అల్లవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కొమ్మరగిరిపట్నంలో ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించింది. సోలార్ మరమ్మతులు, వ్యర్థాల నుంచి సంపద సృష్టిపై విద్యార్థులు ప్రజలకు వివరించారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డా.డి.మహేశ్వర్, వైస్‌ప్రిన్సిపాల్ ఎ.ప్రవీణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నలాది తాతయ్యనాయుడు, కార్యదర్శి చిక్కం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం మండలం ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

• తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తజనం • ప్రత్యేక అభిషేకాలు, పూజలు • కార్తీకదీపాలతో మహిళల సందడి



ఆలమూరు విక్రమ భట్టేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరిపారు. వేకువజాము నుంచే ఆలయాల్లో దీపాలంకరణ నిర్వహించారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తజనం శివుడికి అభిషేకాలు జరిపారు. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలంకరణ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మండలంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి.



రాయవరంలో ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ అమ్మవారు

విక్రమభట్టేశ్వరస్వామి ఆలయంలో...

ఆలమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తజనం ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలమూరులోని విక్రమ భట్టేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రధానార్చకుడు కాళ్లకూరి సూరిపండు ఆధ్వర్యంలో పౌర్ణమి పూజలు నిర్వహించారు. మూలస్థానంలోని మూలేశ్వరస్వామి, మడికిలో సోమేశ్వరస్వామి, జొన్నాడ కాశీవిశ్వేశ్వరస్వామి, చింతలూరు పృథ్వీశ్వరస్వామి, పెనికేరు ఇష్టకాంతేశ్వరస్వామి శివాలయాలతోపాటు మండలంలోని ఆయా శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

ఆకట్టుకున్న జ్వాలాతోరణం

కపిలేశ్వరపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. అంగర, టేకి, కపిలేశ్వరపురం, నల్లూరు, వల్లూరు, కాలేరు, పడమరఖండ్రిక తదితర గ్రామాల్లోని శైవక్షేత్రాలు, విష్ణాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే భక్తులు ఆయా ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారికి అభిషేకాలు జరిపి మొక్కుబడులు చెల్లించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో జ్వాలాతోరణం వెలిగించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ ప్రత్యేక పూజలు

ద్రాక్షారామ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం నరసాపురపుపేట గ్రామంలోనున్న భవానీ శంకరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం మంత్రి సుభాష్ మహా లింగార్చన, భవానీ శంకరస్వామికి ఏకవార రుద్రాభిషేకం చేశారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ముఖమండపంలో చెరుకుపల్లి గణేష్ శర్మ, అర్చకుడు మద్దిరాల శ్రీనివాస దత్తు, మద్దిరాల కామేశ్వర యశ్వంత్‌లతో నిర్వహించిన లింగార్చనలో మంత్రి పాల్గొని పూజలు జరిపారు. అనంతరం భవానీ శంకర స్వామికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం అర్చకులు మంత్రికి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. ముందుగా మంత్రికి ఆలయ ఈవో వి.శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ టేకుమూడి వెంకట రమణ, సర్పంచ్ టాట్రాది వీరలక్ష్మి, చుండ్రు సూర్యనారాయణ, పోలవరపు దుర్గా ప్రసాద్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. వేణుగోపాలస్వామి ఆలయాన్ని దర్శించుకుని శాలిగ్రామ దానం చేశారు. కార్యక్రమంలో అర్చకుడు చక్రవర్తుల వేణుగోపాల్ పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో...

రాయవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో కార్తీక పౌర్ణమిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపారు. తొలుత విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ, తులసిదళ అర్చనలు నిర్వహించారు. అనంతరం విజయదుర్గ అమ్మవారికి లలితా అష్టోత్తర, సహస్ర నామాలు, దుర్గాత్రిశతి, ద్వాత్రింశ నామావళి, లక్ష్మి సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు, భవానీశంకర సమేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం జరిపారు. అనంతరం భక్తులకు కార్తీక వనసమారాధన చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గ సేవా సమితి ప్రతినిధులు గాదే సత్య వెంకట కామేశ్వరి, భాస్కరనారాయణ దంపతులు, బలిజేపల్లి రమ, పెదపాటి సత్య కన దుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి, భక్తులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం: ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



రామచంద్రపురంలోని ఆలయంలో లింగార్చన నిర్వహిస్తున్న మంత్రి సుభాష్

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు: మండలంలోని ఆయా గ్రామాల్లో కార్తీక పౌర్ణమి పూజలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమేశ్వరం బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామికి అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్య శర్మ, పండు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వెంటూరు సోమేశ్వరస్వామి, వెదురుపాక సోమేశ్వరస్వామి, లొల్ల రామలింగేశ్వర స్వామి, పసలపూడి రాజ రాజేశ్వరస్వామి, చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి, రాయవరం కాశీవిశ్వేశ్వర స్వామి, వి.సావరం భీమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటాడాయి.

శివాలయాల్లో పోటెత్తిన భక్తులు

రావులపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. భక్తులు ఆయా ఆలయాల్లో పౌర్ణమి పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.

కోటిపల్లిలో గోదావరి హారతి

కె.గంగవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని కోటిపల్లి వద్ద గోదావరి హారతిని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మన్యాస్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తొలుత గోదావరిమాత విగ్రహానికి, తరువాత గోదావరి నదికి పంచ హారతులతో పాటు, ధూప, నేత్ర, నాగ, బిల్వ, నంది, రుద్ర, కుంభ, నక్షత్ర హారతులు ఇచ్చారు. గోదావరి హారతి సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంత్రి మాట్లాడుతూ గంగానదికి కాశి, హరిద్వార్‌లో హారతి ఎలా సాగుతుందో అలానే గోదావరి నదికి హారతి జరుగుతుందన్నారు. గోదావరి నదికి హారతి కార్యక్రమం ప్రతి ఏటా సాగాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో మన్సాస్ డిప్యూటీ కమిషనర్ కేఎన్‌వీడీ ప్రసాద్, ఆర్డీవో డి.అఖిల, ఎంపీపీ పంపన నాగమణి, కూటమి నాయకులు పప్పుల శ్రీనుబాబు, కర్రి చిట్టిబాబు, వెంటూరి వీర రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ, చికట్ల సోమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం మండలం పడమరఖండ్రికలోని ఆలయంలో భక్తుల పూజలు



రావులపాలెం: రావులపాడు శివాలయంలో స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



కె.గంగవరం మండలం కోటిపల్లిలో గోదావరి నదికి హారతులు ఇస్తున్న దృశ్యం

కేశవస్వామి ఆలయంలో

మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పూజలు



ఆలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి బుధవారం భక్తజనం పోటెత్తారు. అయిదు బుధవారాలు..అయిదు ప్రదక్షిణల నోమును భక్తులు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. భక్తజనం స్వామివారిని దర్శించుకున్న అనంతరం నిత్యాన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

మండపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పాలతోడు గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు గంగరాజు దేవితోపాటు ఆ పార్టీ గ్రామ నాయకుడు గంగరాజు ప్రసాద్ బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరారు. వారిద్దరిని ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. కేశవరానికి పంచాయతీకి చెందిన వైసీపీ వార్డు సభ్యులు పలువురు బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక నేతలు మండపేట టీడీపీ అధ్యక్షుడు కర్రి తాతారావు, ఎంపీపీ వాసు, ఉండమట్ల సురేష్‌ల నేతృత్వంలో 6వ వార్డు పంచాయతీ సభ్యురాలు గోవిందు, మత్స్యకార సంఘ మాజీ అధ్యక్షుడు చుక్కా శ్రీనుతో పాటు పలువురు పార్టీలో చేరారు. వారందరినీ ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నల్లమిల్లి వీర్రెడ్డి, ఎంపీసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, పిల్లా తాతీలు, వై.ప్రసాద్ తదితరులపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

'తోరాటి' జీవితం యువతకు ఆదర్శప్రాయం

కపిలేశ్వరపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంగర గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు తోరాటి లక్ష్మణమూర్తి జీవితం నేటి యువతకి ఆదర్శప్రాయమని వక్తలు అన్నారు. బుధవారం తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంస్మరణ నిర్వహించారు. ముఖ్య అతిధులుగా విద్యా కమిటీ చైర్మన్ గంగుమళ్ళ జానకిరాముడు, సామాజిక కార్యకర్తలు డీవీ రాఘవులు, పెద్దింశెట్టి లెనిన్‌బాబు, హెచ్ఎంఎస్ వి.నాగరాజు మాట్లాడారు. సామాజిక సమస్యలు విద్యార్థుల పాత్ర అంశంపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలోని విజేతలకు వారు నగదు బహుమతులు అందజేశారు. తొమ్మిదవ తరగతి విద్యార్థిని బి.నందిని, సీహెచ్ ప్రశాంతి, గంగుమళ్ళ పండిత సాయికి నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సిలార్ జాన్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు వారంతా ఈకేవైసీ చేయించుకోవాలి

కపిలేశ్వరపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న ఉపాధి హామీ కూలీలంతా ఈకేవైసీ చేయించుకోవాలని సర్పంచ్ దాయం కావేరి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈ రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కాలేరు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఉపాధి హామీ గ్రామసభల్లో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ పనుల నివేదికను ఫీల్డ్ అసిస్టెంట్ కె.క్రాంతికుమార్ వినిపించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈ రవికుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలంతా ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్‌లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కాలేరు గ్రామంలో 52 పనులను గుర్తించినట్లు తెలిపారు. సభలో గ్రామ కార్యదర్శి యు.సుప్రియ, దాయం శేఖర్ బాబు, జనసేన నాయకులు పెయ్యల యాకోబు, ఫీల్డ్ అసిస్టెంట్ కె.క్రాంతికుమార్, మేట్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ బహూకరణ

ఆత్రేయపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి బెంగళూరుకు చెందిన వినపాముల రమేష్‌కుమార్, గాయిత్రీ దంపతులు రూ.1.50 లక్షల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బహూకరించారు. అయిదు వందల లీటర్ల సామర్థ్యం గల శుద్ధి చేసిన జలాలను భక్తులకు అందిస్తారు. బుధవారం దాతలు ఈ ప్లాంట్‌ను దేవస్థానానికి అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ మెర్ల నాగేశ్వరావు, ఈవో బీహెచ్‌వి రమణమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండపేట రూరల్‌లోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండపేట ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ కె.రత్నాలరావు చెప్పారు. ఏడిద సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా 11 కేవీ నూతన ఫీడర్ల ఏర్పాటు, మరమ్మతులు తదితర కారణాల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఏడిద, ఏడిద సీతానగరం, సావరం, కొత్తూరు తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కిరాణా షాపులో చోరీ

కొత్తపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మెయిన్ రోడ్డులో ఉన్న చోడవపీడి వెంకటరామయ్యకు చెందిన కిరాణా షాపులో చోరీ జరిగినట్లు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం.. షాపు నిర్వాహకుడు అయ్యప్పమాల వేసుకుని షాపును నిర్వహించుకుంటున్నారు. మంగళవారం రాత్రి షాపును ముగించుకుని పూజకు వెళ్లారు. బుధవారం తిరిగి షాపు తెరిచేందుకు రాగా తాళాలు తీసి ఉండటాన్ని గమనించారు. అనంతరం లోపలికి వెళ్లి చూడగా షాపులో ఉంచిన రూ.70వేలు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ జి.సురేంద్ర సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థిని మృతిపై దర్యాప్తు చేపట్టాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఆత్మహత్యకు పాల్పడిన సిర్రా రంజిత మృతిపై దర్యాప్తు జరపాలని పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బిసిద్ధూ, ఏఐకెఎంఎస్ నాయకులు వెంటపల్లి భీమశంకరం డిమాండు చేశారు. ఏరియా ఆసుపత్రిలో విద్యార్థి మృతదేహాన్ని సందర్శించిన అనంతరం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. విద్యార్థి చదువుతున్న ప్రైవేటు పాఠశాల, ఇంటి వద్ద కూడా దర్యాప్తు జరపాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు చింతా రాజారెడ్డి, పీడీఎస్‌యు నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.




జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పరిశీలించి కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్

ఆలమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జొన్నాడ వద్ద ఉన్న ఫ్లైఓవర్ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.మహేష్‌కుమార్ పరిశీలించారు. కొత్త కాంట్రాక్టర్‌కు వీటి పనులు అప్పగించిన నేపథ్యంలో మంగళవారం జొన్నాడ ఫ్లైఓవర్ పనులను పరిశీలించి కాంట్రాక్ట్ ప్రతినిధి సురేష్‌తో ఆయన చర్చించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముందుగా సర్వీసు రోడ్డను నిర్మించాలని ఆయన సూచించారు. త్వరలో వాటి పనులు ప్రారంభించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని సురేష్ హామీ ఇచ్చారు. ఫ్లైఓవర్ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ బీకృష్ణమూర్తి, ఆలమూరు తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

రైతులకు సబ్సిడీ దాణా పంపిణీలో కలెక్టర్, ఎమ్మెల్యే



పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, కలెక్టర్ మహేష్ కుమార్

రాయవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పాడిరైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం చెల్లూరు గ్రామంలో కోనసీమ పశుదాణా పథకంలో భాగంగా పశుసంవర్ధకశాఖ, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరస్పర సహకారంతో పాడి రైతులకు రాయితీపై పశుదాణా పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు లాభనష్టాలతో సంబంధం లేకుండా పశువుల పోషణ జరుపుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ రైతులకు రాయితీపై దాణా అందించడం అభినందనీయమన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం రైతులకు కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు చేతులమీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించడంతో పాటు రైతులకు సబ్సిడీపై దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ పాలిక రాఘవ, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణ, చెల్లూరు సొసైటీ చైర్మన్ దేవళ్ల వెంకట్రావు, డీఏహెచ్ఓ కె.వెంకట్రావు, ఆర్డీవో డి.అఖిల, ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, ఎంపీటీసీ గొల్లపల్లి అనురాధ, మాజీ సర్పంచ్‌లు మానె ఏసుబాబు, ఎం.రాజ్‌కుమార్ , మాజీ వైఎస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, జనసేన నేత గొల్లపల్లి వెంకటరమణ, రిమ్మలపూడి వేణుగోపాల దొర, అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, పాడి రైతులు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్వాలాతోరణం

రావులపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుదవారం పలువురు పండితుల వేద మంత్రాల మధ్య జ్వాలాతోరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని ఆయా శివాలయాల ప్రాంగణాల్లో బుధవారం రాత్రి జ్వాలాతోరణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పల్లకీసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.



ముమ్మిడివరప్పాడులో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న దృశ్యం

స్త్రీశక్తి భవనానికి కలెక్టర్ శంకుస్థాపన

మండపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మారేడుబాకలో నిర్మించిన స్త్రీశక్తి భవనం పనులకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే వేగుళ్ల బుధవారం భూమిపూజ చేశారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్‌డీఏ పీడీ జయచంద్రగాంధీ, పిఆర్ఎస్.ఇ పి.రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి వీర్రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

దుళ్ల రోడ్డును బాగు చేయరూ..

మండపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏడిద-దుళ్ల రోడ్డు గోతుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తక్షణమే మరమ్మతులు జరపాలని పలువురు స్థానికులు బుధవారం జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏడిదకు వచ్చిన కలెక్టర్‌కు గ్రామానికి చెందిన పలువురు తమ ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో పలివెల సుదాకర్, రామకృష్ణ స్థానికులు పాల్గొన్నారు.

జనార్దనస్వామి ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ పూజలు

ఆలమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోనున్న జనార్దనస్వామిని అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు హైమాపార్వతి దంపతులు బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి, అప్పనపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాలకు ప్రస్తుతం ఈయన ఏసీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారికి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు తదితరులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

మండపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం సీఎం సహాయ నిధికి ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వారికి మంజూరైన సాయాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల బుధవారం మండపేట కార్యాలయంలో బాధితులకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో గల 26 మందికి మంజూరైన సాయం రూ.11.24 లక్షల చెక్కులను ఆయన చేతులు మీదుగా అందజేశారు. సీఎం సాయం మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.